




డీకే అరుణ | వంశీచంద్‌రెడ్డి | మన్నె శ్రీనివాస్‌రెడ్డి | మల్లు రవి | ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ | పి.భరత్ ప్రసాద్

పాలమూరుపై.. ఫోకస్!

- ప్రచారంలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల పోటాపోటీ
- పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీల కార్యాచరణ
- రెండు సీట్లపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి
- పాలమూరులో స్పీడ్ పెంచని బీఆర్ఎస్.. నాగర్‌కర్నూల్‌పై శ్రద్ధ
- రెండు స్థానాల్లోనూ త్రిముఖ పోరు



మహబూబ్‌నగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల వేళ.. పార్టీలు ఉమ్మడి పాలమూరు జిల్లాపై ఫోకస్ పెంచాయి. అభ్యర్థులు ప్రచార సరళిలో దూసుకుపోతున్నారు. ఇక్కడ రెండు పార్లమెంట్ స్థానాలు ఉండగా.. వాటిల్లో త్రిముఖ పోరు నెలకొనే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అభ్యర్థుల ప్రకటన కంటే ముందే కాంగ్రెస్, బీజేపీలు ప్రచారాన్ని ప్రారంభించి, పాదయాత్రలు, నియోజకవర్గ యాత్రలు చేపట్టగా.. బీఆర్ఎస్ మాత్రం ప్రచారంలో కొంత వెనుకబాటులో ఉందని చెప్పొచ్చు. గత పార్లమెంట్ ఎన్నికల్లో రెండు ఎంపీ స్థానాలను కైవసం చేసుకున్న బీఆర్ఎస్.. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో డీలా పడింది. ఆ పార్టీకి చెందిన కొంతమంది నాయకులు కాంగ్రెస్, బీజేపీలో చేరుతుండటంతో అభ్యర్థుల ప్రకటన కొంత ఆలస్యంగానే జరిగింది. అయితే ఇప్పటికీ బీఆర్ఎస్‌కు ఉమ్మడి జిల్లాలో ఓటుబ్యాంకు బలంగానే ఉంది. మొన్నటి వరకు రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ కావడంతో కాంగ్రెస్, బీజేపీలకు పోటీ ఇచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. జనరల్ స్థానమైన మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ తరపున మాజీ ఎమ్మెల్యే, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్ రెడ్డి అభ్యర్థిగా నిలవగా.. బీజేపీ నుంచి మాజీ మంత్రి, ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పోటీలో ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి ప్రస్తుత ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డికి పార్టీ మరోసారి అవకాశం ఇచ్చింది. ఇక నాగర్‌కర్నూల్ నుంచి కాంగ్రెస్ తరపున టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, బీజేపీ నుంచి కల్వకుర్తి జడ్పీటీసీ, ప్రస్తుత ఎంపీ రాములు తనయుడు పోతుగంటి భరత్ ప్రసాద్, బీఆర్ఎస్ నుంచి మాజీ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పోటీ చేస్తున్నారు. పార్టీలు అభ్యర్థుల గెలుపు బాధ్యతను జిల్లా ముఖ్య నాయకులకు అప్పగించాయి.

సీఎం రేవంత్ ప్రత్యేక దృష్టి..

ముందు నుంచి అనుకున్నట్లుగానే మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గాలకు చల్లా వంశీచంద్‌రెడ్డి, డాక్టర్ మల్లు రవిని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా ఖరారు చేసింది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా పరిధిలో ఉండటం, తనను గెలిపించిన కొడంగల్ నియోజకవర్గం మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో ఉండటంతో రెండు నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో రెండు సార్లు బహిరంగ సభల్లో పాల్గొని పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం చేశారు. తాజాగా గత ఆదివారం కొడంగల్‌లో భారీ మెజారిటీ లక్ష్యంగా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. అలాగే బీఆర్ఎస్ నుంచి చేరికలను ప్రోత్సహిస్తూ.. పార్టీ బలం పెరిగేలా ప్రణాళికలు చేస్తున్నారు. అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి సైతం పార్లమెంట్ పరిధిలో గెలిచిన ఎమ్మెల్యేలతో కలిసి ప్రచారం చేస్తున్నారు. నియోజకవర్గాలు, సామాజికవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. మీ మాటే మా మేనిఫెస్టో పేరుతో కరపత్రాలు విడుదల చేశారు. ప్రజల సమస్యలు, చేయాల్సిన పనులపై సూచనలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పాలమూరు న్యాయయాత్ర పేరుతో నియోజకవర్గం మొత్తం చుట్టేశారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని ఐదు నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందింది. ఈ ఐదు నియోజకవర్గాలతో పాటు మిగతా సెగ్మెంట్లను కూడా కలుపుకుని పార్టీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయితే పాలమూరుతో పోల్చితే ఇక్కడ కొంత ప్రచారం మందకొడిగా సాగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో పార్టీ సమావేశాలు పూర్తి చేయగా.. ఇక నుంచి నేరుగా ప్రచారం చేయనున్నారు. ఆపరేషన్ ఆకర్ష్ పేరుతో మహబూబ్‌నగర్, కోస్గి, వనపర్తి మునిసిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. మహబూబ్‌నగర్ జడ్పీ చైర్‌పర్సన్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోగా.. బీజేపీ నుంచి చిత్తరంజన్‌దాస్ కూడా కాంగ్రెస్‌లో చేరిపోయారు.

నరేంద్రమోదీ సభతో ఉత్తేజం..

బీజేపీ నుంచి అభ్యర్థులుగా ఖరారైన డీకే అరుణ, పోతుగంటి భరత్ ప్రసాద్ ప్రచారంలో దూకుడు పెంచారు. అభ్యర్థి ప్రకటనకు ముందే డీకే అరుణ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా బీజేపీ యాత్ర నిర్వహించింది. రోజూ ఏదో ఒక కార్యక్రమంలో పాల్గొంటున్నారు. టిఫిన్ బాక్స్ బైఠక్, పార్టీ ప్రచార ప్రముఖ్‌లతో సమావేశాలు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. గత ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచిన అరుణ.. అప్పటి నుంచే మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో పట్టు పెంచుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. తన పదునైన మాటలతో ప్రత్యర్థులను ఇరుకున పెట్టడంతోపాటు.. ఓటర్లను ఆకర్షించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. సామాజిక, వ్యాపార వర్గాలతో ప్రత్యేకంగా సమావేశం అవుతున్నారు. డీకే అరుణ తాను ఉమ్మడి జిల్లాకు ఏం చేసిందో చెప్పడంతో పాటు.. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. నాగర్‌కర్నూల్ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్.. తన తండ్రి, ప్రస్తుత ఎంపీ రాములుతో కలిసి ప్రచారాన్ని దూకుడుగా కొనసాగిస్తున్నారు. అలాగే వాకర్స్ మీటింగ్‌లు, కార్యకర్తల సమావేశాలు, ప్రభుత్వ విధానాలపై నిరసనలు తెలుపుతూ పార్టీ బలం పెంచేలా ప్రణాళికలు చేస్తున్నారు. ఈ పార్లమెంట్ పరిధిలో వనపర్తి జడ్పీ చైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సన్నిహితుడు బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిపోయారు. షెడ్యూల్ ప్రకటనకు ముందే నాగర్‌కర్నూల్‌లో నరేంద్రమోదీ నిర్వహించిన ఎన్నికల శంఖారావ సభతో అభ్యర్థులు, కేడర్‌లో ఉత్తేజం నిండిందని చెప్పొచ్చు.

బీఆర్ఎస్ వెనుకబాటు..

అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పరాభవంతో బీఆర్ఎస్ పార్టీ కొంత డీలా పడిందని చెప్పొచ్చు. రెండు పార్లమెంట్ స్థానాలకు ఇప్పటికే అభ్యర్థులు ఖరారు కాగా.. పాలమూరు నుంచి ఇంకా ప్రచారంలో స్తబ్దత నెలకొనే ఉంది. నాగర్‌కర్నూల్‌లో మాత్రం అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రచారంలో స్పీడ్ పెంచారు. రోజూ నియోజకవర్గ పరిధిలో ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉండగా.. అసెంబ్లీ ఎన్నికల్లో అన్నింటిలో బీఆర్ఎస్ ఓటమి చెందింది. మాజీ ఎమ్మెల్యేలు సైతం పెద్దగా పార్టీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. గత పార్లమెంట్ ఎన్నికల్లో రెండు స్థానాలను దక్కించుకున్న బీఆర్ఎస్‌కు నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు బీజేపీలోకి వెళ్లడంతో దెబ్బతగలగా.. జడ్పీ చైర్‌పర్సన్లు, కీలక నాయకులు కూడా పార్టీని వీడుతుండటం కొంత కలవరపెడుతోంది. అయితే పదేళ్ల అధికారంలో ఉండటంతో ఇంకా పార్టీ కేడర్ బలంగానే ఉంది. ఓటుబ్యాంకు కూడా మెరుగ్గానే ఉంది. రెండు స్థానాలను దక్కించుకోవాలని ఆశిస్తున్న పార్టీ అధిష్ఠానం ప్రచారంలో స్పీడ్ పెంచడంతోపాటు నియోజకవర్గాల్లో మాజీ ఎమ్మెల్యేలు, కీలక నాయకుల సమావేశాలు నిర్వహించడంతో పాటు ప్రచారం స్పీడ్ పెంచాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వసూల్ రాజాపై విచారణకు ఆదేశం

- జోగుళాంబ గద్వాలలో రైస్ మిల్లర్ల నుంచి డబ్బుల వసూలుపై కలెక్టర్ సీరియస్
- విచారణ చేపడుతున్నామన్న డీఎస్‌వో విమల

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గద్వాల న్యూటౌన్, ఏప్రిల్ 10: రైస్ మిల్లులకు అధికారుల నుంచి ధాన్యం ఇప్పిస్తానని మిల్లర్ల నుంచి డబ్బులు వసూలు చేసిన బాగోతంపై 'వసూల్ రాజా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ విషయమై జోగుళాంబ గద్వాల కలెక్టర్ సీరియస్ అయినట్లు తెలిసింది. అధికారులకు ముడుపులు ఇవ్వాలని గద్వాల జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ సభ్యుడు, జిల్లా కేంద్రంలోని ఓ రైస్ మిల్లు యజమాని వసూలు చేసిన రూ.30 లక్షలపై కలెక్టర్ ఆదేశాలతో విచారణ చేపడుతున్నామని ఇన్‌చార్జి డీఎస్‌వో విమల చెప్పారు. ఈ వసూల్ రాజాతో పాటు మరో రైస్ మిల్లర్ కూడా ఇందులో ఉన్నట్లు అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు ఇవ్వకుంటే ధాన్యం ఇవ్వరని భయపెట్టి, ఒక్కో మిల్లు నుంచి రూ.50 వేల చొప్పున వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయమై పూర్తి స్థాయి విచారణ చేపడతామని, త్వరలోనే రైస్ మిల్లర్ల అసోసియేషన్‌తో పాటు బాధిత మిల్లుల యజమానులతో చర్చిస్తానని డీఎస్‌వో చెప్పారు. బాధిత మిల్లర్లు నేరుగా తమను సంప్రదించి వివరాలు తెలుపాలని ఆమె అన్నారు. మిల్లర్ల నుంచి డబ్బులు వసూలు చేసిన విషయమై రైస్ మిల్లర్ల అసోసియేషన్‌కు ఎలాంటి సంబంధం లేదని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శీల అశోక్ చెప్పారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- బావిలో పడి ఇద్దరు యువకుల మృతి



శివకుమార్, గణేష్(ఫైల్)

దేవరకద్ర, ఏప్రిల్ 10 : ఈత సరదా ఇద్దరి ప్రాణాలను బలితీసుకున్న ఘటన మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండల పరిధిలోని వ్యవసాయ బావిలో బుధవారం చోటుచేసుకున్నది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ నాగన్న తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ రూరల్ మండలం కోడూరు గ్రామానికి చెందిన ఊషన్న, యశోధ దంపతుల కుమారుడు గణేష్ (21), అంజమ్మ, వెంకటయ్య దంపతుల కుమారుడు శివకుమార్ (22) ఇద్దరూ స్నేహితులు. గణేష్ హైదరాబాద్‌లో డిప్లమా చదువుతున్నాడు. శివకుమార్ కొత్తకోటలో ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. కాగా ఉగాది పండుగ కోసం వారు తమ స్వగ్రామానికి వచ్చారు. సరదా కోసం దేవరకద్రకు సమీపంలోని వ్యవసాయ బావికి ఈతకు వచ్చారు. ముందుగా శివకుమార్ బావిలో దిగి ఈత కొడుతుండగా వెంటనే గణేష్ దిగాడు. గణేష్‌కు ఈత రాకపోవడంతో అతన్ని కాపాడేందుకు వెళ్లి ఇద్దరూ మృతి చెందారు. ఈ సంఘటనతో కోడూర్‌లో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను బావిలో నుంచి బయటకు వెలికితీశారు. పోస్టుమార్టం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

గత ప్రభుత్వం వల్లే.. ఇబ్బందులు

- కర్ణాటక నుంచి జూరాలకు ఐదు టీఎంసీల నీటి విడుదలకు ప్రయత్నం: మంత్రి జూపల్లి కృష్ణారావు



గోపాల్ దిన్నె రిజర్వాయర్ వద్ద తాగునీటి పథకాన్ని పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి

వీపనగండ్ల, ఏప్రిల్ 10: గత బీఆర్ఎస్ ప్రభుత్వం ముందు చూపు లేకుండా వ్యవహరించడం వల్లే ఇప్పుడు తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఎక్సైజ్ శాఖ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల పరిధిలోని గోపల్‌దిన్నె రిజర్వాయర్‌ను, తాగునీటి పథకాన్ని మంత్రి బుధవారం పరిశీలించారు. రిజర్వాయర్‌లో నీటి లభ్యత, అవసరాల గురించి అధికారులను ఫోన్‌లో అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది వర్షాలు సరిగా కురవకపోవడంతో వేసవిలో నీటి కష్టాలు ఏర్పడతాయని తెలిసి కూడా.. రాయలసీమకు సాగు నీటిని తరలిస్తున్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. విద్యుత్ ఉత్పత్తి కోసం నీటిని వినియోగించడం వల్ల ఇప్పుడు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఉన్న నీటిని పొదుపుగా వాడి, ఎలాంటి తాగునీటి కష్టాలు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గోపల్‌దిన్నె రిజర్వాయర్‌లో తక్షణమే మోటర్లు ఏర్పాటు చేసి, ఉన్న తాగునీటి పథకాలకు అందించాలన్నారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మాజీ మంత్రి బంధువులు 50 హెచ్‌పీ మోటార్లతో రిజర్వాయర్ నుంచి నీటిని తరలిస్తున్నారని మంత్రి దృష్టికి తేగా, వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. అక్రమ విద్యుత్ కనెక్షన్ ఉంటే కేసు నమోదు చేయించాలని విద్యుత్ ఎస్ఈని ఆదేశించారు. ఈ రిజర్వాయర్ నుంచి వీపనగండ్ల, చిన్నంబావి, పాన్‌గల్ మండలాల్లోని గ్రామాలకు తాగునీరు అందుతుందని, ఆయా గ్రామాలకు సమస్య రాకుండా జూరాల ప్రాజెక్టు నుంచి ఒక టీఎంసీ నీటిని విడుదల చేయాలని చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని, రైతులు సహకరించాలని మంత్రి కోరారు. తాగునీటి అవసరాల కోసం కర్ణాటక నుంచి జూరాల ప్రాజెక్టుకు ఐదు టీఎంసీలు నీటిని విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అక్కడి ప్రభుత్వంతో మాట్లాడారని తెలిపారు. రైతులకు, గృహాలకు, పరిశ్రమలకు 24 గంటల కరెంటు సరఫరా చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో లబ్ధిపొందాలనే ఉద్దేశంతో ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామచంద్రారెడ్డి, పానగల్ పీఏసీఎస్ మాజీ చైర్మన్ బాల్‌రెడ్డి, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, ఎత్తిన కృష్ణయ్య పాల్గొన్నారు.

నేడు రంజాన్

- ముగిసిన ఉపవాస దీక్షలు



ప్రార్థనలకు సిద్ధమైన మహబూబ్‌నగర్‌లోని వానగుట్ట వద్ద గల ఈద్గా

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 10: రంజాన్ పండుగ జరుపుకునేందుకు గురువారం ఉమ్మడి జిల్లాలోని ముస్లింలు సిద్ధమవుతున్నారు. నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు కొనసాగించిన వారు బుధవారం సాయంత్రం దీక్షలు విరమించారు. బుధవారం రాత్రి మగ్రీబ్ నమాజ్ అనంతరం ఒకరికొకరు ఈద్ ముబాకర్ తెలుపుకున్నారు. బుధవారం రాత్రి మహబూబ్‌నగర్‌లోని క్లాక్ టవర్, న్యూ టౌన్ తదితర ప్రాంతాల్లో ముస్లింలు అధిక సంఖ్యలో షాపింగ్ చేశారు. గురువారం ప్రార్థనలు చేసేందుకు జిల్లాలోని ఈద్గాలు, మసీదుల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు.

పాలమూరులోని వానగుట్టలో గల రహెమానియా ఈద్గాలో ఉదయం తొమ్మిది గంటలకు, మదీనా మసీదులో 8:30 గంటలకు, సిరాజుల్ ఉలుమ్‌లో ఉదయం ఏడు గంటలకు ప్రార్థనలు చేయనున్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు

- కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్, జిల్లా అధికారులు

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతుల పనులు, ప్రతి నివాస ప్రాంతానికి తాగునీటి సరఫరా జరిగేలా కార్యాచరణ రూపొందించినట్లు కలెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. తాగునీటి సరఫరా, ధాన్యం కొనుగోలు, పాఠశాలల మౌలిక వసతుల కల్పన, వేసవికాలంలో జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్లతో బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తీసుకున్న చర్యలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి వివరించారు. జిల్లాలోని 20మండలాలకు 461 గ్రామపంచాయతీలు, నాలుగు మునిసిపల్ పట్టణాల్లో నీటి కొరతను గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతేకాకుండా ఆయా చోట్ల నీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నామని, అవసరమైన చోట బోరు మోటార్లు, చేతిపంపులు, ఇతర తాగునీటి వనరులకు మరమ్మతు పనులు జరిపిస్తున్నామని అన్నారు. ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా స్థాయిలో వడదెబ్బల వల్ల ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. వడదెబ్బ తగిలిన వారికి అవసరమైన ప్రథమ చికిత్స సత్వరమే అందేలా చూడాలని క్షేత్ర స్థాయిలో పని చేసే సిబ్బందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలన్నారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశా లల్లో తాగునీటి సౌకర్యం, నిరుపయోగంగా ఉన్న టాయిలెట్లను ఉపయోగంలోకి తీసుకుని రావడం, అదనపు టాయిలెట్ల నిర్మాణం, తరగతి గదుల మైనర్ మేజర్ మరమ్మతులు తరగతి గదులకు విద్యుత్ సౌకర్యం కల్పన వంటి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కలెక్టర్ తెలిపారు. నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యాన్ని చివరి గింజ వరకు మద్దతు ధరపై కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 199 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఒక లక్ష 10మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు అంచనా వేయడం జరిగిందని, జిల్లాలో 23లక్షల 72వేల 500గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

అదనపు కలెక్టర్లు కుమార్‌దీపక్, సీతారామారావు, డీఎంహెచ్‌వో సుధాకర్ లాల్, డీఈవో గోవిందరాజులు, డీఎస్‌వో స్వామికుమార్, డీఎం సివిల్ సప్లయ్ బాలరాజు, పీడీ డీఆర్‌డీఏ చిన్న ఓబులేషు, డీపీవో కృష్ణ, మార్కెటింగ్ అధికా రి బాలమణి, మిషన్‌భగీరథ ఈఈలు పాల్గొన్నారు.

గెలిచేది.. నిలిచేది నేనే

- కాంగ్రెస్‌లో నాపై చేసిన కుట్రలు బయటపెడతా
- నేను ఏం లబ్ధిపొందానో చూపించాలి
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 10: మహబూబ్‌నగర్ ఎంపీగా గెలిచేది, ఈ ప్రాంత అభివృద్ధి కోసం నిలిచేది తానేనని బీజేపీ ఎంపీ అభ్యర్థి, ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. గత ఎన్నికల్లో ఓడిపోయిన తరువాత కాంగ్రెస్ అభ్యర్థి ముఖం చూపలేదని, ఆయన ఎవరో ప్రజలకు తెలియదని, ఎమ్మెల్యేలు తీసుకెళ్లి పరిచయం చేస్తున్నారని ఆరోపించారు. బుధవారం ఆమె మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎక్కడ చూసినా ప్రజలు కేంద్రంలో మోదీ ప్రధానిగా ఉండాలని, మహబూబ్‌నగర్‌లో బీజేపీ అభ్యర్థిని ఎంపీగా గెలిపించాలని ఫిక్స్ అయ్యారన్నారు. ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదేపదే తనపై విమర్శలు చేస్తున్నారన్నారు. కొడంగల్‌లో కుట్ర చేస్తున్నారని మాట్లాడటం సరికాదన్నారు. తాను పోటీలో నిలబడింది గెలువడానికి తప్ప.. మీ పార్టీ కోసం కాదన్నారు. ఎంగిలి మెతుకులకు ఆశపడి తమ వెంట వెళ్లారని సీఎం హోదాను మరిచి బాష వాడుతున్నారని, మీ వెంట వచ్చి పనిచేస్తే అది సేవ చేస్తున్నట్లు.. మా వెంట వస్తే ఎంగిలి మెతుకులకు వచ్చినట్లా అని అన్నారు. కాంగ్రెస్‌లో పదవులను అనుభవించి, కార్యకర్తల గుండెలపై తన్ని వెళ్లారని మాట్లాడటం సరికాదన్నారు. తాను ఎక్కడ ఉన్నా నిబద్ధతతో ప్రజల కోసం, జిల్లా కోసం పని చేశానన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి, మంత్రిగా ఉమ్మడి జిల్లా అభివృద్ధికి పనిచేశానన్నారు. మీరు ఏం చేశారో చెప్పాలని రేవంత్‌కు సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న తనపై ఎన్నో కుట్రలు, ప్రజల్లో ఉన్న ఆదరణను తగ్గించేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశారన్నారు. రానున్న రోజుల్లో అవన్నీ బయటపెడతానన్నారు. ముందుంది మొసళ్ల పండగ అని చెప్పారు. ఇక్కడున్న కాంగ్రెస్ నాయకుల వ్యవహార శైలి నచ్చక, గౌరవం కోసం బీజేపీలోకి వెళ్లానన్నారు. తన కుటుంబం లబ్ధి పొందిందని అన్నారని, ఏం లబ్ధి పొందామో చూపించాలని సవాల్ చేశారు. అరుణమ్మ కానీ, భరతసింహారెడ్డి కానీ ఏ పార్టీలకు, ఏ కాంట్రాక్టులకు, ఏ బెదిరింపులకు లొంగని కుటుంబం డీకే కుటుంబమని తేల్చిచెప్పారు. వ్యాపారాల మీద దాడి చేస్తే వదిలేసుకున్నామే తప్ప బెదరలేదన్నారు. సోయి తప్పి మాట్లాడితే మర్యాదగా ఉండదని హెచ్చరించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, అధికారంతో విర్రవీగి కేసీఆర్‌కు పట్టిన గతిని తెచ్చుకోవద్దన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మజారెడ్డి, కొండన్న, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రాజేందర్‌రెడ్డి, బండ్ల రమేశ్ పాల్గొన్నారు.

మైనింగ్ పనులను రద్దు చేయాలి

బల్మూరు, ఏప్రిల్ 10 : నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం మైలారం గ్రామానికి ఆనుకుని ఉన్న గుట్టపై మైనింగ్ పనులను రద్దు చేయాలని ఆ గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పనులు చేస్తామంటూ వారంరోజుల క్రితం సంబంధిత కాంట్రాక్టర్ రావడంతో ఆందోళన చేపట్టామని తెలిపారు. ఈ విషయంపై గ్రామస్థులు బుధవారం డిప్యూటీ తహసీల్దార్ పర్వునాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ రెవెన్యూపరంగా మైనింగ్ పనులు చేపట్టకుండా రద్దు చేయాలని తహసీల్దార్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు గోపాల్, శ్రీనివాసులు, మల్లయ్య, బాలకృష్ణ, ఈశ్వర్, సాయిలు తదితరులున్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మైలారం గ్రామస్థులు

గంగారం ఫారెస్టులో

ఆసియన్ ఫాం సీవేట్ క్యాట్ గుర్తింపు

▸▸ ఇతర జంతువుల దాడిలో గాయపడిన సీవేట్ క్యాట్



భీముడితండా సమీపంలో జంతువుల దాడిలో గాయపడి ఉన్న ఆసియన్ ఫాం సీవేట్ క్యాట్

బిజినేపల్లి, ఏప్రిల్ 10 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం గంగారం ఫారెస్టులో అరుదుగా కనిపించే ఆసియన్ ఫాం సీవేట్ క్యాట్ గాయపడి స్పృహ కోల్పోయిన స్థితిలో బుధవారం సాయంత్రం భీముడి తండా వాసులకు కనిపించింది. సమాచారం అందుకున్న గంగారం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ చంటి, బీట్ ఆఫీసర్ మోహన్‌లు సీవేట్ క్యాట్‌ను స్వాధీనం చేసుకొని పశు వైద్యాధికారితో చికిత్స అందించారు. అడవిలో నుంచి నీటి కోసం వచ్చిన సీవేట్ క్యాట్‌ను గుర్తు తెలియని జంతువులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చినట్లు తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో పడి ఉన్న క్యాట్‌కు వైద్య చికిత్స అందించి అబ్జర్వేషన్‌లో ఉంచారు. సాధారణ స్థితికి రాగానే అడవిలోకి వదిలివేస్తామని వారు చెప్పారు. ఇవి అడవిలో దొరికే పురుగులు, పండ్లు, పాములు, బల్లులు వంటి వాటిని ఆహారంగా తీసుకుంటూ 15 నుంచి 20 ఏండ్లు జీవిస్తాయని తెలిపారు. క్యాట్ ఈ ప్రాంతంలో అరుదుగా కనిపిస్తాయని అధికారులు తెలిపారు.

బడిలో మోగని నీటి గంట



చిన్నపార్ల జడ్పీహెచ్ఎస్‌లో వాటర్‌బెల్ కార్యక్రమంలో భాగంగా నీళ్లు తాగుతున్న విద్యార్థులు (ఫైల్)

- ప్రభుత్వ ఉత్తర్వులను పట్టించుకోని ఉపాధ్యాయులు
- వేసవి తాపానికి విద్యార్థులు విలవిల
- ఉమ్మడి జిల్లాలో 5,42,318 మంది విద్యార్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 10 : ఎండలు మండిపోతున్నాయి. శరీరంలో నీటి శాతం త్వరగా తగ్గిపోయి మనుషుల్లో నీరసం వస్తోంది. ఒక్కోసారి వడదెబ్బకు గురవుతున్నారు. వేసవికాలంలో నీరు బాగా తాగాలని వైద్యులు చెబుతున్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ ఉన్న పెద్దలు దీనిని పాటిస్తున్నారు. కానీ పిల్లల్లో పరిపక్వత ఉండకపోవడం.. దాహమైనా నీరు తాగకుండా ఉండటంతో వారి శరీరంలో నీటిశాతం తక్కువై అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ సమస్యలను అధిగమించేందుకు విద్యాశాఖ అన్ని పాఠశాలల్లో విద్యార్థులు తప్పనిసరిగా నీరు తాగేందుకు బడిలో నీటి గంట కొట్టాలని గతంలోనే ఉత్తర్వులు ఇచ్చింది. అంతేకాకుండా విద్యార్థులు నీరు తాగేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉంది.

ఉమ్మడి జిల్లాలో పాఠశాలలు, విద్యార్థుల వివరాలు ఇలా..

జిల్లా	ప్రాథమిక పాఠశాలలు	ప్రాథమికోన్నత పాఠశాలలు	ఉన్నత పాఠశాలలు	విద్యార్థులు
మహబూబ్‌నగర్	679	195	287	1,45,759
నాగర్‌కర్నూల్	638	218	236	1,17,572
జోగులాంబ గద్వాల	294	144	154	1,00,956
వనపర్తి	370	130	192	86,706
నారాయణపేట	359	152	139	91,325

అలా అని చెప్పి వదిలేస్తే వారు తాగరు. నీరు తాగడం అనేది ఒక నియమంలా అలవాటు చేయాలి. ప్రభుత్వం గతంలో చూపించిన విధంగా నీటి గంట వంటి కార్యక్రమం తప్పనిసరిగా అమలు చేయాలి. నీటి గంట కొట్టిన సమయంలో ప్రతీ విద్యార్థి నీరు తాగేలా అలవాటు చేస్తే ఎండాకాలంలో విద్యార్థులు అనారోగ్యానికి గురి కారన్నది డాక్టర్ల సూచన. పాఠశాలలు ఇంకా 15 రోజుల పాటు కొనసాగనున్నాయి. ఈ 15 రోజులు ఎండ తీవ్రత కూడా ఎక్కువ ఉండే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులు బడిలో నీటి గంట కొట్టించాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలి

విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులు పాఠశాలల్లో వాటర్ బెల్ మొదలుపెడితే బాగుంటుందని, దీనిపై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని చెపుతున్నారు. తాజాగా మన పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో బడుల్లో నీటి గంట మోగించాలని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 5,42,318 మంది విద్యార్థులు ఉన్నారు. సుమారు నెలరోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. ప్రజలు బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని పాఠశాలల్లో ఎండాకాలం ముగిసే వరకు మంచినీటి కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకొని, బడిలో ప్రత్యేకంగా నీటి గంట మోగేలా చేస్తే విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడిన వారమవుతామని పలువురు పేర్కొంటున్నారు.

తాగునీరు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు పరిశుభ్రంగా ఉండే విధంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్స్ గురుకుల, ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాళ్లు దృష్టి పెట్టాలని మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంచినీటి నల్లాలు, ట్యాంకులు నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎక్కడైనా పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని ఆ ఉత్తర్వుల్లో హెచ్చరించారు.

ప్రతీరోజు మూడుసార్లు నీటిగంట కొట్టాలి..

అన్ని పాఠశాలల్లో తప్పనిసరిగా ప్రతీరోజు నీటి గంట మూడుసార్లు కొట్టాలనే నిబంధనలు ఉన్నాయి. ఎండల తీవ్రత దృష్ట్యా విద్యార్థులు అనారోగ్యానికి గురికాకుండా వారు నీరు తాగే విధంగా ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలి. పాఠశాలల్లో మంచినీటి సంపులు, నల్లాల వద్ద పరిశుభ్రత పాటించాలి. ఎవరు కూడా నిర్లక్ష్యం వహించొద్దని హెచ్చరించారు.



\- ఏ.రవీందర్, డీఈవో, మహబూబ్‌నగర్ జిల్లా

తగ్గిన ఉక్కపోత

- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 40 డిగ్రీలలోపు గరిష్ఠ ఉష్ణోగ్రతలు

మహబూబ్‌నగర్/నారాయణపేట/నాగర్‌కర్నూల్ టౌన్/గద్వాల/వనపర్తి అర్బన్, ఏప్రిల్ 10 : వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉష్ణోగ్రత కాస్త తగ్గింది. ఉక్కపోత, వడగాల్పులు లేకపోవడంతో జనం ఊపిరిపీల్చుకుంటున్నారు. బుధవారం రెండో రోజు 40 డిగ్రీలలోపే గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకావడంతో జనజీవనం ఎవరి పనుల్లో వాళ్ళు బిజీ అయ్యారు.

వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లిలో 40.7 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. పాన్‌గల్‌లో 40.0, పెబ్బేరులో 39.7, గోపాల్‌పేటలో 39.5, చిన్నంబావిలో 39.4, పెద్దమందడిలో 39.2, శ్రీరంగాపూర్‌లో 38.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లా సీసీకుంట మండలంలో అత్యధికంగా 40.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గండీడ్‌లో 40 డిగ్రీలు నమోదవగా జిల్లాలోని అన్ని మండలాలలో 40లోపే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్‌లో 40.2, వడ్డేపల్లి, రాజోలిలో 39.7, కేటీదొడ్డిలో 39.5, గద్వాల, అయిజలో 39.4, అలంపూర్‌లో 39.3, మల్దకల్‌లో 39.2, గట్టులో 38.4, మానవపాడులో 37.8 డిగ్రీలు నమోదయ్యాయి. నారాయణపేట జిల్లాలో 38 డిగ్రీలు గరిష్ఠ ఉష్ణోగ్రత, 28 డిగ్రీల కనిష్ఠ ఉష్ణో గ్రత నమోదైంది. కోస్గిలో 37 డిగ్రీలు, మక్తల్‌లో 38 డిగ్రీలు, నర్వలో 37 డిగ్రీ లు, కృష్ణలో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రత 38 డిగ్రీలు నమోదు కాగా కనిష్ఠ ఉష్ణోగ్రత 24 డిగ్రీలుగా నమో దైంది. జిల్లాలో అత్యధికంగా కొల్లాపూర్‌లో 39.6, బిజినేపల్లిలో 39.4, నాగర్ కర్నూల్‌లో 38.9, పెద్దకొత్తపల్లిలో 38.7, కల్వకుర్తిలో 37.1, చారకొండలో 36.8, అమ్రాబాదులో 35.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెబ్బేరు, ఏప్రిల్ 10 : వనపర్తి జిల్లా పెబ్బేరు మునిసిపాలిటీ పరిధిలో వనపర్తి వెళ్లే రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఎస్సై సాయిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకా రం.. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం పులికల్ గ్రామానికి చెం దిన తెలుగు చంద్రశేఖర్(29) అనే యువకుడు ఈనెల తొమ్మిదో తేదీన వన పర్తిలో స్నేహితుని పుట్టినరోజు వేడుకలకు హాజరై తిరిగి పులికల్ గ్రామానికి వెళ్తుండగా పెబ్బేరు సమీపంలో బైక్ అదుపు తప్పి కరెంటు స్తంభాన్ని బలం గా ఢీకొన్నాడు. ప్రమాదంలో చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృ తుడి తండ్రి వీరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టానికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరి మృతి

- మరొకరి పరిస్థితి విషమం

ఇటిక్యాల, ఏప్రిల్ 10 : ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోయిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఇటిక్యాల ఎస్సై వెంకటేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం పెద్దదిన్నె గ్రామానికి చెందిన నడిపి నరసింహులు(52), బోయ నర్సింహులు కలిసి బుధవారం సాయంత్రం పెద్ద దిన్నె గ్రామం నుంచి స్వంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై ఎర్రవల్లికి వెళ్లి తిరిగి వస్తున్నారు. మునుగాల గ్రామ శివారులో ద్విచక్రవాహనం ప్రమాదవశాత్తు అదుపు తప్పి ఇద్దరూ కింద పడిపోయారు. విషయం తెలుసుకున్న ఇటిక్యాల పోలీసులు ఇద్దరినీ చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, నడిపి నరసింహులు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా, బోయ నర్సింహులు పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించనట్లు ఎస్సై తెలిపారు. కాగా మృతుడు నడిపి నరసింహులుకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నా రు. ఇతను గ్రామంలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. తీవ్రంగా గా యపడిన బోయ నర్సింహులు కుమారుడి పెళ్లి ఈనెల 18న ఉన్నట్లు గ్రామ స్థులు తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెలకపల్లి, ఏప్రిల్ 10 : చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి(45) మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలంలో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ పరుశరాములు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల ఏడో తేదీన మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద గుర్తు తెలియని వ్యక్తి స్పృహ తప్పి పడిపోయి ఉండగా గమనించిన గ్రామ స్థులు చికిత్స నిమిత్తం 108కు సమాచారమిచ్చి నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రి కి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం వ్యక్తి మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ పరుశరాములు తెలిపారు. వ్యక్తి పూర్తి సమాచారం కోసం ప్రయ త్నిస్తున్నట్లు ఆయన చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీ, కుమారుడికి గాయాలు

ఇటిక్యాల ఏప్రిల్ 10 : జోగుళాంబ గద్వాల జిల్లా కోదండపురం పోలీస్ స్టేషన్ పరిధిలో నారాయణపురం గ్రామ శివారులో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపురం గ్రామానికి చెందిన జనార్ధన్, భార్య మౌనిక, రెండు సంవత్సరాల బాలుడు కలిసి ద్విచక్ర వాహనంపై కోదండాపురం వరకు వెళ్లి అక్కడి నుంచి పెబ్బేరుకు బస్సులో వెళ్లి బాలుడికి వైద్యం చేయించుకొని తిరిగి కోదండాపురంకు వచ్చారు. అక్కడే ఉంచిన ద్విచక్ర వాహనంపై నారాయణపురం గ్రామానికి వెళ్తు స్టేజీ వద్ద మలుపు తిరుగుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న తల్లీ, కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరిని చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

పెబ్బేరులో తొమ్మిది దుకాణాల్లో చోరీ

పెబ్బేరు, ఏప్రిల్ 10 : వనపర్తి జిల్లా పెబ్బేరు మునిసిపాలిటీలోని తొమ్మిది షాపుల్లో మంగళవారం అర్ధరాత్రి దాటాక చోరీ జరిగింది. ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డు షెటర్లలో గుర్తుతెలియని దుం డగులు షెటర్ల తాళాలను పగులగొట్టి చోరీ చేశారు. మేఘన జనరల్ స్టోర్‌లో రూ.45 వేల నగదు, శ్రుతి పాల కేంద్రంలో రూ. 8వేలు, అక్షర మొబైల్స్‌లో రూ.40వేల విలువగల మూడు సెల్‌ఫోన్లు, గాయత్రి మొబైల్స్, అనిల్ మొబైల్, రాఘవేంద్ర బట్టల షాపు, న్యూ వెంకటేశ్వర కిరాణం, శ్రీరామ ట్రేడర్స్ ఆరోగ్య పాల షాపులలో చోరీ జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం షాపు యాజమానులతో వివరాలు సేకరించారు. కాగా దొంగల ఆనవాళ్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయినట్లు తెలిసింది. రెండు స్కూటీలపై నలుగురు యువకులు వచ్చి దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వారిని త్వరలో పట్టుకుంటామని ఎస్ఐ సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

మొక్కజొన్న ట్రాక్టర్ బోల్తా

మానవపాడు, ఏప్రిల్ 10 : జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం చంద్రశేఖర్‌నగర్ గ్రామం వద్ద మొక్కజొన్న లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్ జిల్లా ఆర్‌కే దుద్యాల గ్రామానికి చెందిన రామకృష్ణ అనే రైతు ట్రాక్టర్‌లో మొక్కజొన్న బస్తాలు వేసుకొని ఉండవెల్లి మండలంలోని ఓ ప్రైవేటు కంపెనీకి తరలిస్తుండగా చంద్రశేఖర్‌నగర్ గ్రామం వద్ద రాయిచూర్ రహదారిపై ట్రాక్టర్ ట్రాలీ విరిగిపోయి ఒక్కసారిగా బోల్తా పడింది. ఆ సమయంలో డ్రైవర్ రాంబాబు మాత్రమే ఉండటంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. కానీ మొక్కజొన్న బస్తాలు రోడ్డుపక్కన పడ్డాయి.

బండలాగుడు పోటీల నిర్వాహకులపై కేసు నమోదు

ఉండవల్లి, అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 10 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి, అలంపూర్ మండలంలోని రెండు గ్రామాల్లో అనుమతులు లేకుండా బండలాగుడు పోటీలు నిర్వహించినందుకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్సై సుబ్బారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మారమునగాల-1, బొంకూర్ గ్రామాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వాహకులు బండలాగుడు పోటీలు నిర్వహించారు. మారమునగాలలో నిర్వాహకులైన నరసింహ, శివనారాయణ, టి.కురుమూర్తి, శ్రీనివాసులు, బి.వెంకటేశ్వర్లు, 12ఎద్దుల జత యజమానులపై జంతు హింస చట్టం కింద ఎస్సై శ్రీనివాసులునాయక్ కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. అదేవిధంగా, బొంకూర్ గ్రామంలో బండలాగుడు పోటీ నిర్వాహకులైన బి.భాస్కర్‌రెడ్డి, బి.కోటేశ్వర్‌రెడ్డిలతో పాటు ఆరు జతల ఎద్దుల యజమానులపై జంతు హింస చట్టం కింద ఎస్సై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వివరించారు.

ఆ కామాంధుడు ఎవరు.?

- బాలిక వీడియో చిత్రీకరణ
- ఫొటోలను వారి ఇంటికి పంపి లైంగిక వేధింపులకు యత్నం
- అడిషనల్ ఎస్పీని ఆశ్రయించిన బాధిత కుటుంబీకులు
- చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు
- కొనసాగుతున్న విచారణ

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : భర్తలేని పుట్టెడు దుఃఖంతో ఉన్న ఆమె ఏదో ఒక ఉద్యోగం చేసుకుంటూ ముగ్గురు సంతానాన్ని పోషిస్తోంది. సొంత ఇల్లు కూడా లేకపోవడంతో నాగర్‌కర్నూల్‌లోని ఒకరి ఇంట్లో అద్దెకు ఉంటుంది. ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న ఆమె పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దాలనుకునే క్రమంలో ఓ కామాంధుడి కన్ను ఆ కుటుంబంపై పడింది. భర్తలేని ఆమెను లైంగికంగా వేధించిన సదరు వ్యక్తి బాలికపై కూడా వేధింపులు మొదలుపెట్టాడు. ఆరునెలల క్రితం ఆమె బాత్‌రూమ్‌లో స్నానం చేస్తుండగా వీడియో తీయడానికి ప్రయత్నించాడు. వెంటిలేటర్ నుంచే ఆ విషయాన్ని పసిగట్టిన బాలిక సెల్‌ఫోన్‌పై నీళ్లు చల్లడంతో అతను అక్కడి నుంచి పరారయ్యాడు. ఆ తర్వాత చుట్టుపక్కల ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించే క్రమంలో ఈ సంఘటన తెల్లవారుజామున 5:30 గంటలకు జరిగినట్లు తెలిసింది. అప్పట్లోనే బాలిక తల్లి చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాల పరిశీలనకు పలువురిని అభ్యర్థించింది. బాగా చీకటి ఉన్నందున సీసీ కెమెరాల్లో అతని స్పష్టమైన వీడియో రాలేదు. అనుమానించిన తల్లి తనను, తన కూతురుని ఫోన్లలో అసభ్యకరంగా మాట్లాడుతున్న వారిపై కుటుంబ సభ్యులకు ఫిర్యాదు కూడా చేసింది. అయితే ఐదురోజుల క్రితం తమకు ఈ ఇంట్లో భద్రత లేదని ఇల్లు ఖాళీ చేస్తున్నామని ఇంటి యజమానురాలికి చెప్పిన బాధితురాలి తల్లి వెంటనే షీటీమ్‌కు ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత వెనువెంటనే ఆ ఇంటిని కూడా ఖాళీ చేసింది. రాతపూర్వకంగా ఫిర్యాదు చేసిన బాధితురాలి తల్లిని ఎలాగైనా కాంప్రమైజ్ కావాలని సదరు వ్యక్తులు బతిమాలుతున్నారు. అయితే ఈ కేసును అడిషనల్ ఎస్పీ సీహెచ్.రామేశ్వర్ సీరియస్‌గా పరిగణిస్తున్నారు. ఇంటి యజమాని బాలిక నగ్న వీడియోను చిత్రీకరించాడా, లేదా ఇంకెవరి ప్రమేయం దీంట్లో ఉందా అనే అంశంలో కూడా సమగ్ర విచారణ జరుపుతున్నారు. కేసును తప్పుదారి పట్టించేందుకు శతవిధాలా ప్రయత్నాలు జరుగుతుండగా ఒక బాలిక నగ్న వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేసిన విషయంలో అసలు ముద్దాయిలు ఎవరో కనుక్కోకపోతే పోలీసుల ప్రతిష్ట దెబ్బ తింటుందని ఎస్పీ కూడా షీటీమ్‌కు వార్నింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. తనను వీడియో తీసి నగ్న ఫొటోను తన ఇంటి గుమ్మం ముందు ఉంచిన వాళ్లను తక్షణం అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని బాధితురాలు పోలీస్ ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు సమాచారం.

ఆర్టీసీ బస్ కండక్టర్‌పై దాడి కేసులో

ఇద్దరికి రెండేళ్ల జైలుశిక్ష

- రూ.500 చొప్పున జరిమానా
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రితిరాజ్

గద్వాల క్రైం, ఏప్రిల్ 10 : ఆర్టీసీ బస్ కండక్టర్ విధులను ఆటంకపరచడమే కాకుండా దాడి చేసిన కేసులో ఇద్దరు నిందితులకు రెండేళ్ల జైలుశిక్షతో పాటు, ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధిస్తూ అలంపూర్ కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి ఉదయ్‌నాయక్ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ రితిరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.కృష్ణయ్య 2015 మార్చి 15న అలంపూర్ నుంచి కర్నూల్‌కు వెళ్తున్నాడు. అలంపూర్ మాంటిస్సోరీ స్కూల్ వద్ద ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి బస్ ఎక్కి డోర్ వద్ద నిలబడ్డారు. బస్సు ఎక్కే ప్రయాణికులపై ఉమ్మివేయడం, కావాలని తాకడం వంటివి చేస్తుండగా కండక్టర్ ప్రశ్నించారు. దీంతో ఆ ఇద్దరు వ్యక్తులు కండక్టర్‌పై దాడికి దిగారు. ప్రయాణికులు సర్ది చెప్పిన తర్వాత బస్సు కర్నూల్ బస్టాండ్‌కు చేరింది. తర్వాత తిరిగి వస్తుండగా ఇమామ్‌పూర్ గ్రామం వద్ద మళ్లీ అదే ఇద్దరు వ్యక్తులైన అలంపూర్‌కు చెందిన చాకలి శ్రీనివాస్, గోపి బస్సు ఎక్కారు. టికెట్ తీసుకోవాలని చెప్పగా వారు కండక్టర్ విధులను ఆటంకపరిచారు. తనపై దాడి చేసిన ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని అలంపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై పర్వతాలు కేసు నమోదు చేశారు. ఎస్పీ ఆదేశానుసారం అలంపూర్ సీఐ రవిబాబు, ఎస్సై నాగరాజు కోర్టులో సాక్షులను మోటివేట్ చేశారు. ఇరువురి వాదనలు విన్న అలంపూర్ కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి ఉదయ్‌నాయక్ దాడి చేసిన చాకలి శ్రీనివాస్, అలంపూర్ ఎంపీడీవో కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న గోపిలకు రెండేళ్ల జైలుశిక్షతో పాటు, ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. నేరస్తులకు జైలుశిక్ష పడటానికి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్తీక్‌రాజు, కోర్టు కానిస్టేబుల్ మాబాషాలను ఎస్పీ అభినందించారు.

నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు

- ఎస్పీ యోగేష్ గౌతమ్
- సింగారం గ్రామంలో భారీగా నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

నారాయణపేటటౌన్, ఏప్రిల్ 10 : నారాయణపేట జిల్లాలో నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ నారాయణపేట మండలం సింగారం గ్రామంలోని పూజారి మల్లప్ప ఇంట్లో దాదాపు 16 బ్యాగుల్లో ఎనిమిది క్వింటాళ్ల నకిలీ హెచ్‌టీ కాటన్ విత్తనాలను టాస్క్‌ఫోర్స్ లోకల్ పోలీసులు, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి పట్టుకున్నారు. కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా గుర్మిట్కల్ మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన జాజాపురం నర్సప్ప అనే వ్యక్తి నకిలీ పత్తి విత్తనాలను రాయచూరు జిల్లాలోని శక్తినగర్‌కు చెందిన బ్రహ్మయ్య కాటన్‌మిల్ వద్ద తక్కువ ధరకు తీసుకున్నాడు. ఇతను దాదాపు తొమ్మిది క్వింటాళ్ల విత్తనాలను కొనుగోలు చేసి బొలెరోలో తీసుకు వచ్చి సింగారం గ్రామంలోని ఉంటున్న తన మామ పూజారి మల్లప్ప ఇంట్లో నిల్వ చేశాడు. అందులో నుంచి ఒక క్వింటాల్ నకిలీ పత్తి విత్తనాలను ఊట్కూరు మండలం నిడుగుర్తికి చెందిన కురువ బుగ్గప్పకు విక్రయించాడు. మంగళవారం సాయంత్రం ఈ విత్తనాలను నర్సప్ప వేరే వ్యక్తులతో అమ్మడానికి ఇంటి వద్ద ఉండగా పోలీసులు నిర్వహించిన సంయుక్త దాడిలో నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. ఆ తరువాత నిడుగుర్తి గ్రామానికి వెళ్లి కురువ బుగ్గప్ప వద్ద నుంచి దాదాపు 85 కిలోల నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకొని నేరస్తులపై కేసులు నమోదు చేశామన్నారు. మొత్తం ఎనిమిది క్వింటాళ్ళ 85 కిలోలు నకిలీ విత్తనాల విలువ రూ.8,85,000 ఉంటుందని ఎస్పీ తెలిపారు. నకిలీ విత్తనాలను పట్టుకోవడంలో బాగా పనిచేసిన పోలీసులను, అగ్రికల్చర్ అధికారులను ఎస్పీ అభినందించారు. త్వరలో రివార్డు ఇస్తామని చెప్పారు. వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్న రైతులకు నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఇలాంటి కేసులు మళ్లీ నమోదు అయితే అలాంటి వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఎస్పీ తెలిపారు. జిల్లాలో ఎవరైనా నకిలీ విత్తనాలు సరఫరా చేసినా, విక్రయించినట్లు తెలిస్తే జిల్లా పోలీసులకు లేదా డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు. సమావేశంలో డీఎస్పీ లింగయ్య, సీఐలు శివశంకర్, రాంలాల్, ఎస్సై వెంకటేశ్వర్లు, అగ్రికల్చర్ అధికారి శరత్‌చంద్ర తదితరులున్నారు.

కొనసాగుతున్న వాహన తనిఖీలు

- జోగుళాంబ గద్వాల జిల్లాలో రూ.2,14,500 నగదు సీజ్
- పెబ్బేరులో రూ.మూడు లక్షలు పట్టివేత

గద్వాల క్రైం/పెబ్బేరు, ఏప్రిల్ 10 : లోక్‌సభ ఎన్నికల కోడ్‌లో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు జరుగుతున్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా పోలీస్‌స్టేషన్ పరిధిలో, సరిహద్దు చెక్‌పోస్టులలో పోలీసులు చేపడుతున్న వాహన తనిఖీల్లో బుధవారం ఎలాంటి రశీదులు లేని రూ.2,14,500 నగదును సీజ్ చేసి జిల్లా ఎన్నికల గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటీకి అప్పగించినట్లు ఎస్పీ రితిరాజ్ తెలిపారు. కేటీదొడ్డి మండల పరిధిలోని నందిన్నె చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేయగా ఒక వాహనంలో ఎలాంటి రశీదులేని రూ.60 వేలు, రాజోలిలోని సుంకేసుల చెక్‌పోస్టు వద్ద ఉండవెల్లి మండలం ప్రాగటూరు గ్రామానికి చెందిన సూర్యమధుగౌడు అనే వ్యక్తి రాజోలిలో చీరలు కొనుగోలు చేసేందుకు కారులో వస్తుండగా అతని వద్ద నుంచి రూ.లక్ష, గట్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.54 వేలు మొత్తం రూ.2,14,500 నగదును సీజ్ చేసి జిల్లా ఎన్నికల గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటీకి అప్పగించినట్లు ఎస్పీ వివరించారు. అదేవిధంగా, వనపర్తి జిల్లా పెబ్బేరు మండల కేంద్రం సమీపంలో జాతీయ రహదారి కర్నూల్ బైపాస్ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద బుధవారం చేపట్టిన వాహనాల తనిఖీలో రూ.మూడు లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై సాయిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా మరికల్ మండలం కన్మనూర్ గ్రామానికి చెందిన రంజిత్‌కుమార్ అనే వ్యక్తి కారులో రూ.మూడు లక్షల నగదు తీసుకెళ్తుండగా పట్టుకున్నామన్నారు. ఎలాంటి అనుమతిపత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు తెలిపారు.

అమరచింతలో ..

అమరచింత : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా అమరచింత పట్టణ పరిధిలోని రాజీవ్‌చౌక్ జంక్షన్ వద్ద బుధవారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న కారణంగా వాహనాల్లో మద్యం, డబ్బు అత్యధికంగా తరలించే అవకాశం ఉందని, ఇందుకోసం వాహన తనిఖీలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఆర్‌సీ, ఇన్సూరెన్స్ డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనాల తనిఖీలు చేపట్టి జరిమానాలు విధించినట్లు తెలిపారు.

భూత్పూర్‌లో కేంద్ర సాయుధ బలగాల మోహరింపు

భూత్పూర్ : ఎంపీ ఎన్నికల సందర్భంగా కేంద్ర సాయుధ ప్రత్యేక పోలీసుల బృందం జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్‌కుమార్ ఆదేశం మేరకు బుధవారం భూత్పూర్ చౌరస్తాలో స్థానిక ఎస్సై శ్రీనివాసులు ఆధ్వర్యంలో వాహనాలను సోదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాసులు విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా ఎన్నికల సంఘం ఆదేశానుశారం కేంద్ర సాయుధ బలగంతో అక్రమ మద్యం, డబ్బును నిరోధించడానికి గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్‌కుమార్ ఆదేశం మేరకు జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. కార్యక్రమంలో రెండవ ఎస్సై శివ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



అమరచింతలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై సురేష్



అంతర్రాష్ట్ర సరిహద్దులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర పోలీస్ బృందం

ఎండుతున్న వరి పంటలు

- లబోదిబోమంటున్న అన్నదాతలు

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 10 : రైతులు బోరు బావుల కింద యాసంగిలో సాగు చేసిన వరిపైర్లు ఎండిపోతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు కారణంగా జల మట్టం పడిపోయింది. రోజురోజుకు ఎండ తీవ్రత అధికం కావడంతో బోరుబావులు నీటి మట్టం తగ్గిపోతుండడంతో పంటలకు నీటిని పెట్టలేకపోతున్నారు. పెద్దకొత్తపల్లి మండలంలోని పెద్దకొత్తపల్లి, వెన్నచెర్ల, నక్కలప్లి, చంద్రకల్ తదితర గ్రామాల్లో రైతులు బోరు బావులను నమ్ముకుని 7359 ఎకరాల్లో వరి పంట, 7488ఎకరాల్లో వేరుశనగ, 3300 ఎకరాల్లో మినుముల పంటలను సాగు చేశారు. పంటలు సాగు చేసే సమయంలో బోరు బావుల్లో నీటి లభ్యత ఎక్కువగా ఉండడంతో ఎక్కువ విస్తీర్ణంలో పంటలను సాగు చేశారు. ప్రస్తుతం చేతికొచ్చే దశలో నీటి నిల్వలు పడిపోయాయి. ఫలితంగా వేసిన పంటకు నీరందక ఎండిపోతున్నాయి. రైతులు పగలనక, రాత్రనక నానా తంటాలు పడి పంటలను కాపాడుకునేందుకు ప్రయత్నం చేస్తున్నా ఫలితం లేకపోతుంది. కొంతమంది రైతులు పంటకు నీటిని అందించలేక వదులుకుంటున్నారు. మరికొందరు రైతులు కొంత భాగం వదిలివేసి మిగిలిన పంటను కాపాడుకుంటున్నారు. మామిడి తోటల రైతుల పరిస్థితి అధ్వానంగా మారింది. తోటలకు నీటిని అందించలేక ఎండుతుండడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు ఇంకిపోవడం కాల్వల ద్వారా నీటి సరఫరా బంద్ కావడం రైతుల పాలిట శాపంగా మారింది. ప్రభుత్వం రైతులున ఆగు చేసిన పంటలపై సమగ్ర విచారణ జరిపి పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని పలు గ్రామాల రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



దేవునితిర్మలాపూర్ శివారులో ఎండిన వరి పంటను మేస్తున్న గొర్రెలు

● ప్రభుత్వం ఆదుకోవాలి

తాను బోరు బావుల కింద సాగు చేసిన వరి పంటకు నీరందక ఎండిపోతుంది. పంట కోసం వేల రూపాయల పెట్టుబడి పెట్టాను. పంటను కాపాడుకోవడానికి రాత్రి పగలు అష్టకష్టాలు పడుతున్నాను. ఫలితం లేకపోతుంది. ప్రభుత్వం పంట నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి.



- శివుడు, రైతు, దేవునితిర్మలాపూర్

ప్రధాని మోదీతోనే దేశంలో సుపరిపాలన

- బీజేపీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్

కల్వకుర్తి, ఏప్రిల్ 10 : ప్రధాని నరేంద్రమోదీతోనే దేశంలో సుపరిపాలన సాధ్యమని నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారిలు అన్నారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని బలపర్చి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు పిలుపునిచ్చారు. కల్వకుర్తి పట్టణంలో బుధవారం మార్నింగ్ వాకర్స్‌తో బస్టాండ్ ప్రాంతంలో హోటళ్ల వద్ద, హనుమాన్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ బీజేపీని బలపర్చాలని వారు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో పది స్థానాలకు పైగానే బీజేపీ ఎంపీ అభ్యర్థులు గెలవబోతున్నారని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం బీజేపీ కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను రూపొందించి అమలుపరుస్తుందని వారు తెలిపారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్, గుండూరు మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి, బీజేపీ నాయకులు కృష్ణగౌడ్, సురేందర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, రాంరెడ్డి, విజయ్, అభిలాష్‌రెడ్డి, రాజేందర్, శ్రీధర్, బాబీదేవ్, చందు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

● వెల్దండ: కేంద్రంలోని ప్రధాని మోదీ నేతృత్వంలోని సర్కార్‌తోనే దేశ భవిత ఆధారపడి ఉందని బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా పార్లమెంటు అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ అన్నారు. బుధవారం మండలపరిధిలోని కొట్రతాండా, కొట్ర, పోతేపల్లి, ఎంజీకాలనీ, దుబ్బతాండా, అంకమోనికుంట గ్రామాలలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలుచేసి పేదవర్గాల అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. కేంద్ర పథకాలను ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేయడంలేదని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు కల్లబొల్లి మాటలుచెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో చేతులెత్తేసిందని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆలయాలలో భరత్‌ప్రసాద్, ఆచారిలు ప్రత్యేక పూజలు చేశారు. నియోజవర్గ ఇన్‌చార్జి యెన్నం శేఖర్‌రెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు కుర్మిద్ద యాదగిరి, సీనియర్ నాయకులు బండెల రాంచంద్రారెడ్డి, జంగయ్యయాదవ్, బాలస్వామి, దుర్గాప్రసాద్, కృష్ణగౌడ్, మోహన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, అబిలాష్, రామస్వామి, సురేష్‌గౌడ్ ఉన్నారు.



కల్వకుర్తిలో వాకర్స్‌తో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

● వందపడకల ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు

● ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, ఏప్రిల్ 11: వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి వైద్యులను, సిబ్బందిని ఆదేశించారు. రోగులకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం జడ్పీ వైస్‌చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌తో కలిసి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత వాసుడైన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ ప్రాంతంలోని ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలో 100 పడకల ఆసుపత్రిని నిర్మించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకొంటుందని తెలిపారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఎవరైన విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అన్నారు. ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే గర్భిణులకు, ఇతర రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి వారి మెప్పును పొందాలని ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి వెంట రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సంజీవ్‌కుమార్‌యాదవ్, పలువురు నాయకులున్నారు.



కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్

గోపిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఆశయాలను కొనసాగిద్దాం

కల్వకుర్తి మాజీ ఎంపీటీసీ దివంగత గోపిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణంలో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం గోపిడి సుధాకర్‌రెడ్డి వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి విగ్రహానికి జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్‌లతో కలిసి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేపట్టారు. నాయకులు భూపతిరెడ్డి, చిన్న రాంరెడ్డి, ప్రమోద్, సంజీవ్‌కుమార్, మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఏజాస్, రమకాంత్‌రెడ్డి, మిరియాల దామోదర్‌రెడ్డి, శేఖర్, హనుమనాయక్, రాంరెడ్డి, శ్రీనివాసులు, రామకృష్ణ, మబ్బు సాయన్న మాదిగ, సదానందంగౌడ్, వెంకటేస్, నేతాజీ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్‌తో మేలు

● మాజీ ఎమ్మెల్యే గుర్కజైపాల్‌యాదవ్

కల్వకుర్తి, ఏప్రిల్ 11: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపు ఖాయమని, ఆయన పార్లమెంట్‌లో ఉంటే పేదలకు, బడుగు బలహీన వర్గాలకు మేలు జరుగుతుందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ గెలుపును ఏ శక్తి అడ్డుకోలేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే యాదవ్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బుధవారం నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి తనకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను జైపాల్‌యాదవ్ పూలమాల, శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురుకులాల కార్యదర్శిగా పనిచేసిన ఆయన ఎంతో మంది పేద విద్యార్థులు చదువుకునేలా బాటలు వేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు కాని హామీలతో ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు కేశవరావు, కొమ్ము శ్రీనివాస్‌యాదవ్ తదితరులున్నారు.



మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఆవంచలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

తిమ్మాజిపేట, ఏప్రిల్ 10 : ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు తిమ్మాజిపేట మండల రిధిలోని ఆవంచ గ్రామంలో వెలసిన శ్రీమహాలక్ష్మి గోదాసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అంగరంగ వైభవంగా ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విశ్వక్సేన ఆరాధన పుణ్యాహవచనం మృత్ సంగ్రహానం అంకురార్పణ, మంగళ శాసనం వంటి పూజా కార్యక్రమాలు ఆలయంలో చేశారు. ఈ బ్రహ్మోత్సవాలు నాలుగు రోజుల పాటు జరుగుతాయని ప్రతిరోజు పూజా కార్యక్రమాలతో పాటుగా భక్తులకు అన్నదానం చేయడం జరుగుతుందని భక్తులకు కనీస వసతులు కల్పించామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆవంచ గ్రామానికి చెందిన మాజీ మంత్రి జడ్చర్ల మాజీ శాసన సభ్యుడు చర్లకోల లక్ష్మారెడ్డి తన సొంత నిధులతో దేవాలయాన్ని నిర్మింపజేశారు. స్వామిని దర్శించుకున్న భక్తులకు మంచి జరుగుతుందని సకల పాపాలు దూరమవుతాయని భక్తుల నమ్మకం. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకోవడం విశేషం.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ జి. మాధవరెడ్డి

కల్వకుర్తి, ఏప్రిల్ 11: పార్లమెంట్ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని కల్వకుర్తి ఎస్ఐ జి. మాధవరెడ్డి తెలిపారు. వాహనాల్లో రూ. 50 వేలకంటే ఎక్కువగా ఉంటే అందుకు సంబంధించిన ఆధారాలు కచ్చితంగా వెంట తెచ్చుకోవాలని ఆయన సూచించారు. కల్వకుర్తి పట్టణంలో బుధవారం ఎస్పీ ఆదేశాలతో ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. తనిఖీల్లో వాహనాలను నిలిపి క్షుణ్ణంగా పరిశీలించినట్లు ఎస్ఐ మాధవరెడ్డి పేర్కొన్నారు. తనిఖీల్లో ఎస్ఐ-2 రామచందర్‌జీ, ఏఎస్ఐ హనుమంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి

లింగాల, ఏప్రిల్ 10: మండల పరిధిలోని ధారారం గ్రామంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం దాతల సహకారంతో నిర్వహించిన జిల్లా స్థాయి బండలాగుడు పోటీలు అట్టహాసంగా జరిగాయి. ఈ పోటీలలో వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 23 ఎద్దుల జతలు పోటీల్లో పాల్గొన్నాయి. ఈ పోటీలను సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి ప్రాముఖ్యతనిస్తూ పశు సంపదను పెంపొందించేందుకు ఈ పోటీలు దోహదపడుతాయని అన్నారు. రైతులకు నూతన ఉత్సాహన్ని కల్గించేందుకు గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టే విధంగా ఈ పోటీలను మారుమూల ప్రాంతాల్లు నిర్వహించడం గర్వకారణమని నిర్వాహకులను ఆయన అభినందించారు. రైతుల శ్రేయస్సుకు ఉపయోగపడే విధంగా ఇలాంటిలు మున్ముందు కూడా నిర్వహించే విధంగా అందరు సహకరించాలని ఆయన సూచించారు. ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగిన బండలాగుడు పోటీలను తిలకించడానికి పెద్ద సంఖ్యలో వివిధ గ్రామాల నుంచి రైతులు తరలి వచ్చారు. మైదానంలో ఎద్దుల జతలు చూపిన విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ పోటీలలో మొదటి బహుమతిని రూ.20వేలు అమ్రాబాద్ మండలం ఎల్మపల్లికి చెందిన కదారి బాలయ్యకు చెందిన ఎద్దుల జతలు కైవసం చేసుకోగా, ద్వితీయ బహుమతిని రూ.15వేలు లింగాలకు చెందిన గాలేటి నారాయణస్వామి ఎద్దుల జతలు, తృతీయ బహుమతిని రూ.10వేలు బల్మూర్ మండలం పోలిశెట్టిపల్లి గ్రామానికి చెందిన బురాన్‌బాషా ఎద్దుల జతలు కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దాతలు ధారారం మాజీ సర్పంచ్ కవితా శ్రీనివాసులు, క్యాంపు రాయవరం మాజీ సర్పంచ్ వేషయ్య, అశోక్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాగ్యా బాయి శంకర్‌రాథోడ్, మహేష్, నరేష్‌యాదవ్‌లను నిర్వాహకులు సన్మానించారు.

జిల్లా ప్రజలకు కలెక్టర్ రంజాన్ శుభాకాంక్షలు

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలకు ముస్లింలు రంజాన్ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. గురువారం రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్)పండుగ సందర్భంగా ముస్లింలకు కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ పవిత్ర రంజాన్‌మాసంలో ఇళ్లల్లోనే ఉండి 30రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు ఆచరించిన విధంగానే రంజాన్ పర్వదినాన ఈద్గాలో ప్రార్థనలు చేసుకోవాలని సూచించారు. ఈ మాసంలో ఆధ్యాత్మిక, ఆరాధనతో అనుబంధం మరింత బలపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

కల్వకుర్తి, ఏప్రిల్ 10: క్రీడలు మానసికోల్లాసాన్ని స్నేహభావాన్ని దోహదపడుతాయని యువజన సంఘాల సేవా సమితి జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. మండలంలోని ఎల్లికట్టలో మన సేవా సమితి ఆధ్వర్యంలో క్రీడాకారులకు బుధవారం వాలీబాల్, నెట్ వాలీబాల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరిలో పట్టుదల, కృషి ఉంటే దేనినైనా సాధించవచ్చన్నారు. క్రీడల వలన శారీరక దారుఢ్యంతో పాటు స్నేహభావాన్ని పెంపొందించవచ్చన్నారు. క్రీడల ద్వారా సమాజంలో మంచి గుర్తింపు క్రీడాకారుడికి ఉంటుందన్నారు. సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, సైదులు, మాదే రవీందర్, పవన్, బాలగౌడ్, ప్రవీణ్, ఇంద్రాల, కంఠం ప్రవీణ్, అన్నరపు జ్ఞానేశ్వర్‌రెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అస్వస్థతకు గురై ఉపాధి హామీ కూలీ మృతి



కొమ్ము దస్రయ్య (ఫైల్)

వెల్దండ, ఏప్రిల్ 10 : గ్రామంలో ఉపాధిహామీ పనులు చేస్తూ అస్వస్థతకు గురై కొమ్ము దస్రయ్య (దశరథం)(57) అను వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సల్లపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... దస్రయ్య గ్రామస్థులతో కలిసి ఉదయం ఉపాధి పనులలో భాగంగా రోడ్డు ప్రక్కన చెట్లు కొట్టే పనికి వెళ్లాడు. ఈ క్రమంలో అస్వస్థతకు గురైన దస్రయ్య కళ్లు తిరిగి కిందపడిపోయాడు. దీంతో అప్రమత్తమైన తోటి కూలీలు ఆటోలో దస్రయ్యను చికిత్స నిమిత్తం వెల్దండలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. అనంతరం మృతుడిని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఎండవేడిమిని తట్టుకోలేకే వడదెబ్బసోకి మృతిచెంది ఉంటాడని గ్రామస్థులు తెలిపారు. మృతునికి భార్య సుభద్రమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

మృతి చెందిన దస్రయ్య కుటుంబాన్ని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా పరిషత్ వైఎస్ చైర్మన్ బాలాజీసింగ్, డీఆర్‌డీవో చిన్నవోబులేష్‌లు కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ జయప్రకాష్, ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, ఏపీవో ఈశ్వర్‌లు ఉన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేతలకు బహుమతులు ప్రదానం



మొదటి విజేతగా నిలిచిన సింగోటం వాలీబాల్ జట్టుకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కొల్లాపూర్, ఏప్రిల్ 10 : కొల్లాపూర్ మండల పరిధిలోని మొలచింతలపల్లి గ్రామంలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన ఉమ్మడి జిల్లా వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతలకు బుధవారం బహుమతులు ప్రదానం చేశారు. ఉగాది పర్వదినం సందర్భంగా రమేష్‌యాదవ్ స్మారకార్థం నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో వివిధ ప్రాంతాల నుంచి వాలీబాల్ జట్లు పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటాయని కరాటే మాస్టర్ శరబంద పేర్కొన్నారు. వాలీబాల్ టోర్నమెంట్‌లో మొదటి విజేతగా సింగోటం గ్రామానికి చెందిన వాలీబాల్ జట్టు నిలవగా రెండవ స్థానంలో జడ్చర్ల ప్రాంతానికి చెందిన వాలీబాల్ జట్లకు కరాటే మాస్టర్ శరబంద, మాజీ సింగిల్ విండో వైస్ చైర్మన్ హుజూర్ శ్రీను, మొలచింతలపల్లి గ్రామ పెద్దలు విజేతలకు బహుమతులు అందజేశారు.

బీజేపీ రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడిగా శేఖర్



పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 10 : బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా ఇంద్రకంటి శేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన పేర్కొన్నారు. పెద్దకొత్తపల్లికి చెందిన ఇంద్రకంటి శేఖర్‌ను బుధవారం ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేసినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దకొత్తపల్లిలో ట్రాక్టర్ రివర్స్ పోటీలు



గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 10 : మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలో ఉగాది పండుగను పురస్కరించుకుని మాజీ సర్పంచ్ ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు దండు నరసింహులు ట్రాక్టర్ రివర్స్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి పెద్దకొత్తపల్లికి చెందిన పిట్టల రమేష్‌కు 3వేల రూపాయలు, ద్వితీయ బహుమతి వంశీకి 2వేల రూపాయలు, మద్దిలేటికి తృతీయ బహుమతి వెయ్యి రూపాయలను మాజీ సర్పంచ్ ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు దండు నరసింహులు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు డబ్బ ఎల్లయ్య బండి చంద్రయ్య శివశంకర్, శ్యామ్‌రావు, మేకల చంద్రయ్య, అవగారి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి జూపల్లి



మసీద్‌లో మంత్రి జూపల్లిని సన్మానిస్తున్న ముస్లింలు

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 10 : మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలో ముస్లింలకు మాజీ సర్పంచ్ ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దండు నరసింహులు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఇఫ్తార్ విందులో తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు మంత్రిని శాలువాతో సన్మానించారు. అనంతరం ముస్లింలకు మంత్రి పండ్లు, మిఠాయిలు తినిపించారు. ఎంపీపీ సూర్యప్రతాప్ గౌడ్, నాయినోనిపల్లి మైసమ్మ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, నాయకులు మేకల చంద్రయ్య, దండు చంద్రయ్య, అశోక్‌రెడ్డి, డబ్బ ఎల్లయ్య టి.కృష్ణయ్య, శ్రీనివాస్‌రెడ్డి, పి.బాలస్వామి, శ్రీనివాస్‌యాదవ్, ముస్లిం సోదరులు బాబు బషీరుద్దీన్, బాలేమియా, బాబా, సుల్తాన్, మైను, ఖాజా పాల్గొన్నారు.

కోడేరు: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని మసీద్‌లో ఆయన ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు.

దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత

ఊర్కొండ: దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని బీఆర్ఎస్ నాయకుడు దండోత్కర్ నాగోజీ అన్నారు. బుధవారం మండలంలోని ఊర్కొండపేట జామే మసీద్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ముస్లిం పెద్దలను శాలువాతో ఘనంగా సన్మానించారు. మహ్మద్ జహంగీర్, అబ్దుల్ బారి, అబ్దుల్ రషీద్, ఎండీ రిజ్వాన్, అజహర్, అలీం, సజీదోద్దిన్, మైనోద్దీన్, ఖాజ, ఖదీర్, సమీర్, జహంగీర్ తదితరులు ఉన్నారు.

వరి పంటలను కాపాడండి



నాగులపల్లి తండాలో బోరు మోటారుకు విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడంతో ఎండిన వరి పంట

కోడేరు, ఏప్రిల్ 10 : యాసంగి పంటలకు విద్యుత్ సరఫరా చేసి వరి పంటలను కాపాడాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. మండల పరిధిలోని నాగులపల్లి తాండాకు చెందిన రైతు రఘునాయక్ యాసంగిలో రెండెకరాల వరి సాగు చేయగా బోరు బావికి విద్యుత్ సరఫరా సరిగ్గా చేయకపోవడంతో అర ఎకరం నీళ్లు లేక ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా గురించి అధికారులను అడగ్గా మా చేతుల్లో ఏమి లేదు పై నుంచి అలా సరఫరా అవుతుందని సమాధానమిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి చేతికొచ్చిన పంటను కాపాడాలని విద్యుత్ సరఫరా చేసి ఆదుకోవాలని రైతులు శంకర్, రఘు, వెంకటస్వామి, కుర్మయ్య, భీమ్లానాయక్ కోరుతున్నారు.

'వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి'

ఉప్పునుంతల, ఏప్రిల్ 10 : మండలంలో యాసంగిలో చేపట్టిన వరి సాగును రైతులు కోతలు చేస్తున్న నేపథ్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాట్లు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చింతల నాగరాజు బుధవారం ఒక ప్రకటలలో తెలిపారు. సింగిల్‌విండో ఆధ్వర్యంలో గతంలో మాదిరిగా మండలంలోని పలు గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి రైతుల వద్ద నుంచి వరి ధాన్యాన్ని మద్దతూ ధరకు కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

నిషేధిత మందులు అమ్మితే చర్యలు తప్పవు

తిమ్మాజిపేట, ఏప్రిల్ 10 : రైతుకు నిషేధిత మందులు అమ్మితే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ హెచ్చరించారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలోని మణికంఠ ఆగ్రో రైతు సేవ కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను ఈపాస్ మిషన్‌ను పరిశీలించి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ పాస్ మిషన్ ద్వారానే ఎరువుల అమ్మకాలు జరగాలన్నారు. మిషన్ ద్వారానే నిల్వ ఉన్న ఎరువులు రైతుకు అమ్మిన ఎరువుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. క్రిమిసంహారక మందులు, విత్తనాలు, ఎరువులు రైతుకు అమ్మితే రసీదు ఇవ్వాలన్నారు. ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహరక మందులకు సంబంధించిని రికార్డులను నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు.

గుండె ఆపరేషన్ కోసం రూ.3లక్షల ఎల్‌వోసీ

తాడూరు, ఏప్రిల్ 10 : మండలంలోని గుట్టలపల్లి గ్రామానికి చెందిన భగ వంతు కుమార్తె శి రీషకు గుండెకు సంబంధించి సమస్యలు వచ్చాయి. దీంతో స్థా నిక ఎమ్మెల్యే కూచ కుళ్ల రాజేష్‌రెడ్డి, ఎ మ్మెల్సీ దామోదర్ రెడ్డిల దృష్టికి తీసుకె ళ్లగా గుండెకు సం బంధించిన చికిత్స ని మిత్తం 3లక్షల ఎల్ వోసీని మంజూరు చే యించి కుటుంబ సభ్యులకు బుధవారం ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి అందజేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా జ్యోతిబాపూలే జయంతి వేడుకలు

కల్వకుర్తి, ఏప్రిల్ 10: కల్వకుర్తి మండల పరిధిలోని ఎల్లికల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో జ్యోతిబాపూలే జయంతి వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. హెచ్ఎం విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పర్విన్, కవిత, గ్రామ కార్యదర్శి అభిజిత్‌రెడ్డి, నాయకులు బ్రహ్మం, బక్కయ్య, లోకేష్, మల్లయ్య, శ్రీను, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిమడుగు నుంచి మల్లురవి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం

అచ్చంపేట, ఏప్రిల్ 10: ఈ నెల 12 నుంచి నాగర్ కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లురవి స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి పదర మండలం మద్దిమడుగు పుణ్యక్షేత్రం నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కట్ట అనంత రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్దిమడుగు నుంచి పదర అమ్రాబాద్, మన్ననూర్, అచ్చంపేట, ఉప్పునుంతల, వంగూర్, చారకొండ వరకు ఈ ప్రచారం కొనసాగుతుందని తెలిపారు.

ముగిసిన ఎల్లమ్మ నాటకం

వంగూరు, ఏప్రిల్ 10: మండలంలోని ఉమ్మాపూర్‌లో మూడు రోజుల ఎల్లమ్మ నాటకం బుధవారం ముగిసింది. మహిళలు బోనాలతో నైవేద్యాలను సమర్పించారు. నాటకాన్ని తిలకించేందుకు గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో రావడంతో సందడిగా మారింది. ఎల్లమ్మ, జమదగ్ని, పరుషరాముడు, వేశాదారణలో కళాకారులు చక్కగా ఆడిపాడారు. భక్తులు నిద్రను మానిచాలా అసక్తితో నాటకాన్ని చూశారు.

గెస్ట్‌లెక్చరర్ల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

బల్మూరు, ఏప్రిల్ 10 : గెస్ట్‌లెక్చరర్ల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని గెస్ట్ లెక్చరర్ల రాష్ట్ర అధ్యక్షుడు కొర్ర ఈశ్వర్‌లాల్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కొండనాగుల ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమావేశమైన గెస్ట్‌లెక్చరర్ల సమావేశంలో గెస్ట్ లెక్చరర్ల రాష్ట్ర అధ్యక్షుడు కొర్ర ఈశ్వర్‌లాల్ మాట్లాడుతూ ఈ నెల 13న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర స్థాయిలో గెస్ట్‌లెక్చరర్ల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించుకుంటున్నామని తెలియజేశారు.

ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్రంలోని 145డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న అతిథి అధ్యాపకులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, టీజేఎస్ పార్టీ అధ్యక్షుడు కోదండరామ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మహేష్‌కుమార్‌గౌడ్, విద్యారంగ నిపుణులు హర్షవర్ధన్‌రెడ్డి, రియాజ్, పీఎస్‌జీవో రాష్ట్ర అధ్యక్షులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర ట్రెజరర్, జిల్లా ఉపాధ్యక్షురాలు గాయత్రి, కార్యదర్శి వెంకటస్వామి, కళాశాల అధ్యక్షులు కృష్ణ, గోపాల్, ప్రధాన కార్యదర్శి కిరణ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు - బెల్లం ఊట ధ్వంసం

వెల్దండ, ఏప్రిల్ 10 : మండలంలోని దుబ్బతండా, దూద్యనాయక్ తండా, రావిచెట్టుబావితండా, పోచమ్మగడ్డతండాలలో బుధవారం స్టేట్ టాస్క్‌ఫోర్స్, మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్, జిల్లా టాస్క్‌ఫోర్స్, కల్వకుర్తి ఎక్సైజ్, వెల్దండ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. సుమారు 1400 లీటర్ల సారాకు ఉపయోగించే బెల్లంపానకం, 12 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. 60 కిలోల నల్లబెల్లం, 10 కిలోల పటికిని స్వాధీనం చేసుకున్నారు. దాడులలో ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి, ఎస్‌టీఎఫ్ సీఐ శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి, డీటీఎఫ్ సీఐ కళ్యాణ్, వెల్దండ ఎస్ఐ రవి, ఎక్సైజ్ ఎస్ఐ మురళిలు పాల్గొన్నారు.